క్లుప్తంగా

గోపాలపట్నంలో ఆర్ట్ ఎగ్జిబిషన్ నేడు

గోపాలపట్నం: మహాత్మా గాంధీ వర్ధంతి, కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం ఆళ్వార్ దాస్ కళాశాలలో సింహాచలం యోగా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్ ఎగ్జి బిషన్ జరుగుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు బీబీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. మహాత్మా గాంధీ జీవిత చరిత్రపై 101 చిత్రాలు ప్రదర్శించనున్నామని పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు.

వసంత్‌కుమార్‌కు జియ్యాని శ్రీధర్ నివాళి



మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్(70) భౌతిక కాయాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సందర్శించారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆదివారం వేకువ జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న జియ్యాని ఆస్పత్రికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మోదకొండమ్మకు బీసీ నేతల పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న సీమాంధ్ర బీసీ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం మోదకొండమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలోని బీసీ వర్గాల ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని అమ్మవారిని వేడుకున్నారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు మొల్లి రమణబాబు, తోనంగి వెంకట రమణి యాదవ్, బంధం పైడిరాజు, సోమునాయుడు, కోరలయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన భేష్



బీపీ చెక్ చేయించుకుంటున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో ఆదివారం కోరమాండల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేసే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సేవలు అందించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కోరమాండల్ జీఎం (హెచ్‌ఆర్) శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్ పరిశీలన

గాజువాక: ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ పాతగాజువాక బస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. నూతనంగా ప్రారంభించిన ఈ స్టేషన్‌లో నిర్వహించాల్సిన కార్యకలాపాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కార్గో పార్శిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. గాజువాక నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్శిళ్ల బుకింగ్, వచ్చిన వాటిని ఆయా బుకింగ్‌దారులకు అందజేసేందుకు పాటించాల్సిన మెలకువలను వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం (ఐదు వార్డుల పరిధి) నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పుల్లేటికుర్తి సూర్యనారాయణ, అధ్యక్షుడిగా గొలుకొండ రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వి.సింహాచలం, కార్యదర్శిగా వి.లోవరాజు,కోశాధికారిగా కె.మల్లేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా సూర్యారావు, అధికార ప్రతినిధిగా ఎల్‌ఏ నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.సంతోష్‌తో పాటు పలువురు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గం తమ సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో నాయీ బ్రాహ్మణుల కోసం సామాజికభవనం ఏర్పాటుకు అధికారులు,పాలకులతో మాట్లాడుతామని వారు వివరించారు.

చలానా ఇబ్బందులు తొలగించాలి

ఆటోవాలాల వేడుకోలు



సమస్యలను వివరిస్తున్న ఆటో కార్మికులు

మల్కాపురం: ఈ చలానాలతో తమ బతుకులు భారంగా మారాయని ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆటోయూనియన్ అధ్యక్షుడు గొలగాని అప్పలరాజు తదితరులు కోరారు. పారిశ్రామిక ప్రాంతం గాజువాక నుంచి సింధియా వరకు సుమారు10 కి పైగా ఆటో స్టాండ్‌లు ఉన్నాయన్నారు. సరైన స్టాండ్‌లు లేక ఇబ్బందులు పడుతుంటే.. ట్రాఫిక్ పోలీసులు నిబంధనల పేరిట చలానాలు విధించడంతో వచ్చిన సొమ్ము వాటికి చెల్లించడానికే సరిపోతుందన్నారు. రెండు వాయిదాల లోపు చలానా కట్టకపోతే ఆటోను అధికారులు స్వాధీనం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ చలానా నుంచి తమ ఆటో డ్రైవర్లకు మోక్షం కల్పించాలని వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన వరలక్ష్మి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం సమీప రెండో బ్రిడ్జిపై మూడు వాహనాలు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక మహిళకు గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం సాయంత్రం గాజువాక నుంచి ఎన్‌ఏడీకి స్కూటర్‌పై వస్తున్న వ్యక్తి అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చింది. దీంతో వెనుక వస్తున్న కారు డ్రైవర్ తన వేగాన్ని తగ్గించాడు. కారు వెనుక వస్తున్న బొగ్గు లారీ కారును ఢీకొట్టడంతో అది ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో స్కూటర్ వెనుక కూర్చున్న వరలక్ష్మి కిందకు పడిపోవడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. స్థానికుల సహకారంతో గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేటూరి పాటలు అజరామరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సిందూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజేంద్రప్రసాద్, జ్యోత్స్న పాడిన రాగాల మేళవింపా.. రమేష్ పట్నాయక్, శృతి పాడిన వే వేళా గోపెమ్మలా.. ఎంవీఆర్ నాగేశ్వరరావు, సూర్యకుమారి పాడిన మనసులోని కోరిక.. జోగారావు, రచన శ్రీకృతి పాడిన స్వప్న వేణువేదో.. ఫణిభూషణ్, కల్యాణి పాడిన ఒకపూల బాణం.. ధీరజ్ పాడిన కంచికి పోతావా కృష్ణమ్మ.. ఫణిభూషణ్, దీప్తి పాడిన పూసింది పూసింది పున్నాగా.. శిరాణి పాడిన ఓహో మేఘమాల వంటి ప్రజాదరణ పొందిన గీతాలతో అలరించారు. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎస్.ఎన్.రాజు, సన్ మూర్తి, టి.రాధారాణి తదితరులు వేటూరి సేవలను కొనియాడారు. ముందుగా వేటూరి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

సమస్త జీవులపై కరుణ, ప్రేమ అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: జంతువుల పట్ల కరుణ–అహింసపై గాంధేయ–బౌద్ధ దృక్పథంపై గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో ఆదివారం ప్యానల్ చర్చ నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ క్యూరేటర్ ప్రొఫెసర్ పి.శంకరరావు ముఖ్యఅతిథి మాట్లాడుతూ సర్వ జీవుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని గాంధీజీ సిద్ధాంతాలు తెలియజేస్తాయని చెప్పారు. ఆదివాసీ సంస్కృతిలో జంతువులను దేవతలుగా పూజించడం, వాటిని రక్షించే గొప్ప సంప్రదాయం ఎప్పుడూ ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ రచించిన 'బాపు కుక్కురిప శతకం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మహాత్మా గాంధీజీకి జంతువుల పట్ల ఉన్న అభిమానం, బౌద్ధ సన్యాసి కుక్కురిపా నుంచి ఆయన నేర్చుకున్న 108 కవితల సంకలనంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. విశాఖ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ కేర్ ఆఫ్ యానిమల్స్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్‌నాథ్ మాట్లాడుతూ ప్రజలు విదేశీ కుక్కల జాతులను ఇష్టపడుతున్నారని, దేశీయ జాతులను రోడ్లపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాబోధి సొసైటీ స్థానిక అధిపతి ధమ్మాచారి విజయకుమార్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు జంతువులతో సహా అన్ని జీవులపై ప్రేమ, కరుణ చూపించేలా ఉన్నాయన్నారు. గాంధేయ అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ, శ్రీలంక బౌద్ధ సన్యాసి హేమసిరి థెరో, గాంధీ అధ్యయన వేత్త రావిప్రోలు సుబ్రహ్మణ్యం, డాక్టర్ కిశోర్ కుమార్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు

గాజువాక: పదో తరగతి విద్యార్థులకు వచ్చేనెలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలల నిర్వహణకు అవసరమైన అన్ని రికార్డులను పాఠశాలల యాజమాన్యాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డీసీఈబీకి పరీక్ష ఫీజుల చెల్లింపు, ఎల్‌కేజీ, యూకేజీల గుర్తింపు, పాఠశాలల అప్‌గ్రెడేషన్, రెన్యువల్, ఆన్‌లైన్ హాజరు నమోదు, ఆర్టీఈ యాక్టులను ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. జిప్సా ప్రతిష్టకు ఏ సభ్యుడి ద్వారా భంగం వాటిల్లకుండా ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. జిప్సాను త్వరలోనే రాష్ట్ర సంఘంతో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు.

నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా దాసుబాబు



సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన మేడిపాటి దాసుబాబు నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక డాక్‌యార్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొత్త కార్యవర్గం ఇదే..

అధ్యక్షుడిగా మేడపాటి దాసుబాబు, గౌరవ అధ్యక్షుడిగా రొంగలి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా జి.ఎర్రినాయుడు, సోర్నిపూడి సత్యం,కార్యదర్శులుగా గొర్లి దేముడు, సిరిపురపు హరీష్, పైల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా జి. అచ్యుతరావు, సహాయ కార్యదర్శిగా జి. చినరాము ఎన్నికయ్యారు.అలాగే కార్యవర్గ సభ్యులుగా పి. అచ్చంనాయుడు,పి. ఈశ్వరరావు, ఆర్. రవి,ఆర్ గణపతి,రమణ ఎన్నికయ్యారు.

'న్యాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలి'

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ సిహెచ్.విష్ణుమూర్తి ఓ ప్రకటనలో కోరారు. దీనికి సంబంధించి విద్యార్థులకు వచ్చే ఈ–మెయిల్‌కు తక్షణమే స్పందించి సూచించాలని పేర్కొన్నారు. అందులో పొందుపరిచిన 20 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు తమ మెయిల్‌ను తరచూ పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డుకు అడ్డంగా డంపర్ బిన్లు



దుర్గానగర్ వద్ద రోడ్డుకు అడ్డంగా పెట్టిన డంపర్ బిన్లు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో దుర్గానగర్ వద్ద రోడ్డుకు అడ్డంగా డంపర్ బిన్లు ఏర్పాటు చేశారు. కంచరపాలెం నుంచి ఊర్వశి కూడలికి వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వే మార్గంలో ఇవి ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో తొలగించిన చెత్తను డంపర్ బిన్ల వద్ద కార్మికులు వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతోంది. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టుకు ప్రముఖుల తాకిడి



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

గోపాలపట్నం: విశాఖ ఎయిర్‌పోర్టుకు ఆదివారం ప్రముఖుల తాకిడి తగిలింది. నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. వారికి ఎయిర్‌పోర్టులో నాయకులు ఘన స్వాగతం పలికారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విశాఖ చేరుకున్నారు. వీరికి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు, మాజీ మంత్రి పసులేటి బాలరాజు, జీవీఎంసీ కో ఆప్షన్‌సభ్యుడు బెహరా భాస్కరరావు, యతిరాజుల నాగేశ్వరరావు, పక్కి దివాకర్ తదితరులు స్వాగతం పలికారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతం సమర్పిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నమో భువనేశ్వరీ..

- వైభవంగా అధివాసం
- పోటెత్తిన భక్తజనం



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



భువనేశ్వరీదేవికి మంగళస్నానాలు చేయిస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇక్కడ కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం నిర్వహించిన ఈ ప్రత్యేక అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం ఈ అధివాసం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ అధివాసం వాకుడు(బృహతి) పత్రితో నిర్వహించారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు. దివ్య పంచామృతాలతో అభిషేకించి, అనంతరం దివ్యాలంకరణ చేసి అర్చనాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు క్యూలో నిరీక్షించి మరీ అమ్మవారికి స్వయంగా పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగాలి

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్
- ముగిసిన హ్యాక్‌థాన్ కార్యక్రమం



విజేతలతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: సవాళ్లను స్వీకరిస్తూ వాటికి పరిష్కారాలు చూపే దిశగా యువత పయనించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాక్‌థాన్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు రిజిస్ట్రార్ బహుమతులు ప్రదానం చేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం మార్గదర్శకంలో విద్యార్థులు నవ్య ఆవిష్కరణలు జరపాలని ఆయన సూచించారు.

విజేతలు వీరే...

హ్యాక్‌థాన్ విజేతల వివరాలను ప్రకటించారు. అల్టిమేట్ క్రియేషన్స్ సభ్యులు వి.మణికంత, పి.హరీష్, జి.అనీల్‌కుమార్, సిహెచ్.అశోక్, బి.భార్గవ్ ప్రథమ స్థానంలో, డాష్ సభ్యులు సుభాంగి సాహా, వై.శ్రీనివాస్, దర్శన్ శేరింగర్, అజయ్ శర్మ, హర్‌కిరట్ కౌర్ దాని ద్వితీయ స్థానం, ఇంట్–కాగ్నిటో బృందం ఆశిష్ సింగ్, మేఘన దత్త, భావన, దివోదశి సింఘ్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. రఘు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన క్రియేటివ్ సీ కోడర్ సభ్యులు ఎం.ఎస్.సాయి నీరజ్, ఎల్.అమృత యశస్విని, పి.జగదీష్ ప్రత్యేక బహుమతిని సాధించారు. కార్యక్రమానికి డిజిఫాక్, సాండ్‌లాజిక్ టెక్నాలజీస్ సహకారం అందించాయి. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఆల్‌కోవ్ పార్టనర్స్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ మాదాల, డాక్టర్ పి.రామరాజు, డాక్టర్ డి.లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం గర్జిద్దాం రండి

- ఉక్కునగరం త్రిష్నా మైదానంలో నేడే ప్రజా గర్జన



పాదయాత్ర చేస్తున్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం నామమాత్రపు ధరకు భూములు ఇస్తే వాటితో కేంద్ర ప్రభుత్వం నేడు వ్యాపారం చేయాలని చూస్తోందని, దీన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అగనంపూడి అఖిలపక్షాల నాయకులు ఇల్లపు ప్రసాద్, నెల్లి శ్రీనివాసరావు, కర్రి దశేంద్రరావు, గవర సోమశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా జీవీఎంసీ 79, 85వ వార్డుల్లోని అగనంపూడి నిర్వాసితకాలనీలు, పరిసర ప్రాంతాల్లో ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసిత ఐక్య వేదిక, అఖిలపక్షాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఉక్కునగరంలోని త్రిష్నా మైదానంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, పదవీ విరమణ పొందిన, మృతి చెందిన కార్మికుల ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిర్వాసితులకు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లా కొండలరావు, బలిరెడ్డి సత్యనారాయణ, జె.అయోధ్యరామ్, కరణం పైడిరాజు, పెదిరెడ్ల నీలకంఠం, మోటూరి వెంకటరమణ, వంకర రాము, ఉరివిటి మరిడయ్య, గెద్దాడ అప్పలరాజు, బొట్టా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కునగరం త్రిష్నా మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, సీఐటీయూ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జంక్షన్ నుంచి నమ్మిదొడ్డి మీదుగా దేవాడ జంక్షన్ వరకూ అఖిల పక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఉక్కు గర్జనకు ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.